
పదమూడేళ్లనుంచీ కాపురం చేస్తున్నామా ఇద్దరికీ




అర్ధరాత్రి వేళదాకా దూరదర్శి నిని దర్శించి, అదృష్టం బావుంటే ఏ అర్ధరాత్రి దాటాకో నిద్రలోకి జారుకునే బస్తీవాసులకి....

...అప్పుడప్పుడే సుఖమైన గాఢ సుషుప్తిలో విశ్రాంతి పొందుతున్నవేళ....

...ముచ్చటగా మూడో జాములో, విడవకుండా చెవిదగ్గర అలారం కొట్టే కుక్కుటరాజం, కోడిపుంజు, ప్రాతఃకాలపు ప్రథమ శత్రువు అని ప్రత్యేకించి చెప్పక్కర్లేదనుకుంటాను.

ఇంత మహానగరంలో అందునా పూర్తి ఉద్యోగస్తులేవున్న నగరం నడిబొడ్డులో కోడిపుంజుకూతలెక్కడివి అని మీరు ప్రశ్నించవచ్చు.

రెండేళ్లనుంచీ సుఖంగానేవున్నాం. రెండు నెలల క్రితమే మా ప్రాణంమీదికి తీసుకొచ్చి పెట్టింది మా ఇంటావిడ ఓ కోడిపుంజునీ, మూడు పెట్టలనీమా. భార్యా భర్తలిద్దరూ అరవై ఏళ్ల ప్రాయంలో వున్నా చక్కగా ధృడంగా ఆరోగ్యంగా మంచి ఓపికతో వున్నారు. ... ఈ కాలపు లెక్కలో చూస్తే.. కొడుకులనీ కూతుళ్లనీ అందరినీ ఎటువాళ్లని అటు పంపించేసి, బాధ్యతలన్నీ తీరినవేళ కాలక్షేపంకోసమేమో మరికొత్తగా ఈ మినీ పౌల్ట్రీ చేపట్టారు.

మా ఆవిడమాత్రం మహాముచ్చటపడింది. దొడ్డంతా సందడిచేస్తూ తిరుగుతున్న ఆ నాలుగు జీవాలనీ చూస్తూ నేను పల్లెటూరిలో పుట్టి పెరిగినవాడినవటంవలన మా ఊరంతా మానవ జనాభాతో సమానంగావుండే కోడిజనాభా కారణంగా అంతగా ఆసక్తి ప్రదర్శించలేదు. ఆ మాటకొస్తే వాటి ఉనికిని పట్టించుకోలేదుకూడా కొన్నాళ్లు.

కానీ ఉండివుండి ఈ మధ్య అకారణంగా చక్కటి తెల్లవారుకట్ల నిద్ర చటుక్కున చెదిరిపోతుండటం, ఎంత తన్నుకున్నా మళ్లీ నిద్రపట్టకపోవడం జరుగుతుంది. మళ్లీ ఏ అయిదుగంటలు దాటాకో నిద్రపట్టీ పట్టగానే మా ఇంటావిడ ఇల్లదిరిపోయే సౌండుతో భక్తిరంజని కార్యక్రమం పెట్టడంతో ఆ కాస్త నిద్రా వదిలిపోయేది.

ఏమిటీ ఈ మధ్య ఇలా వేళకానివేళ చక్కటి నిద్రపాడవుతోందీ అని ఆలోచించగా, ఆలోచించగా ఓ రోజు చెవిదగ్గర కోడికూత అలారం కొట్టినట్లు వినిపించింది. వరుసగా అయిదురోజులు కారణం ఇదే అని ఖచ్చితంగా రుజువు చేసుకున్నాక నమిలి మింగేద్దామా అన్నంత కోపం వచ్చింది ఆ కోడిమీద. వెధవది శుద్ధ శాకాహారిని అయిపోయాను కానీ దాన్ని కోసుకు తినేద్దామా అన్నంత కసిపుట్టేది.

ఉన్నట్లుండి ఓ కొత్త అనుమానం పొడసూపింది నాకు.

మా ఇంటావిడకు మేము ఉదయం ఏడు దాటితే కానీ నిద్రలేవమని మహాగుర్రు మామీద. ఆ సంగతి పదిమనుషుల దగ్గర జోకులేస్తూ వుంటుంది లెండి. నా అనుమానం ఏమిటంటే మమ్మల్ని తనతో పాటుగా ఆరుగంటలలోపు నిద్రలేపే కార్యక్రమంలో భాగంగా, ఆవిడ లేచీ లేవగానే చాలా చప్పుళ్లు చేసేది. మంచాలు లాగటం, గాడ్రెజ్ కుర్చీలు బంబరా చప్పుళ్లు చేస్తూ అటూ ఇటూ జరపడం... ఇల్లు ఊడవటం లక్షణం అన్నమాట... ఇవన్నీ ఫలించకపోతే భక్తిరంజని ఫుల్ సౌండులో పెట్టేసి... ఎంతైనా భక్తిరంజనికదా, తిట్టలేమని నమ్మకం. సెంటిమెంటుని దెబ్బతియ్యటం — మమ్మల్ని జుట్టుపట్టుకుని లేపి కూర్చోపెట్టడం, ఇంత నమ్మకంగా ఎందుకు చెబుతున్నానంటే మేం లేచి తలుపు తియ్యగానే ఆవిడ రేడియో పూర్తిగా తగ్గించేసేది... గడుసుగా.

ఈ మధ్య ఆ భక్తిరంజని వింటూకూడా మొండిగా నిద్రపోవటం మొదలెట్టాం. అందుకనే మా ఇంటావిడ మా తిక్క కుదర్చడానికి ఈ కోళ్ళని పెంపకంచేసి మా మీదకి పంపకం చేసిందా అని నాకు మా చెడ్డ అనుమానంగావుంది. రెండు నెలలనుంచీ తెల్లవారుగట్ల నిద్రకి నోచుకోలేదు నేను. ఈ విషయంలో మా ఆవిడ అదృష్టవంతురాలులెండి. ఏ కాస్త శబ్దానికి నిద్ర చటుక్కున మెలుకువ వస్తుంది. మళ్లీ చటుక్కున నిద్రపోతుంది. చాణుక్యుడు నీతి దర్పణంలో చెప్పినట్లు ఇది నిజంగా చాలా ఆరోగ్యకరమైన విషయమే. జంతువులనుంచి మనం నేర్చుకోవలసిన మంచి అలవాట్లు ఎన్నో ఉన్నాయని చక్కటి

# దశరథుడంతటి వాడికేతప్పనట్లు — సంతానం లేదు



కె. జనార్ధన శర్మ,

ఉదాహరణ ఇస్తారు ఓ శ్లోకంలో చాణుక్యుడు. నిజమే. మరి నా నిద్ర మాటేమిటి. తెల్లవారగానే పరుగెత్తాల్సిన ఆఫీసు పని మాటేమిటి. నిద్రచాలక కాస్త కన్ను బెదిరితే చాలు వేల్లో ఖర్మకాలితే లక్షలలో కూడా పీకకి చుట్టుకునే వ్యవహారాలలో క్షణంక్షణం చిన్న సంతకాలూ, పెద్ద సంతకాలూ చేసే అంకెలు ప్రాణాలతో చెలగాటమాడే — ఉద్యోగం మాటేమిటి.

నా బాధ ఇలావుండగా మా ఆవిడ మాత్రం మహా ముచ్చటపడుతోంది. ఆ కోడి కుటుంబాన్ని చూస్తూ.

తెల్లగా ఠీవిగా నెత్తిమీద ఎర్రటి కుచ్చుపాగాతో నడిరోడ్డులో లాఠీ పుచ్చుకుని నిలబడే పోలీసంత ఠీవితో కెక్కెక్కెక్కే అంటూ సందడి చేస్తూ దర్జాగా ఆ తెల్లకోడి పుంజూ, దాని వెనక వెనకే తిరుగుతూ ముగ్గురు రాణులూ, ఒకటి ముదురు గోధుమ రంగులో పెద్దదిగా, రెండవది గోధుమ రంగులో ఇంకాస్త చిన్నదిగా, మూడోది తెల్లగా ముచ్చటగా ముద్దుగా లేతగా.

...చెప్పొద్దూ ఓ ఆదివారం మధ్యాహ్నం తీరిగ్గా చూస్తున్నవేళ నాకు కూడా ముచ్చటవేసి, వాటికి నామకరణం చేశాను. దశరథ మహారాజూ, కౌసల్యా, సుమిత్రా, కైకేయీ అని. ఆ రోజు ఉదయమే టీవీలో రామానంద్ సాగర్ గారి రామాయణం ప్రారంభమైంది. రామాయణ, భారత, భాగవతాలు మనకి నిత్యం నిత్యజీవితంలో ఎన్నో సందర్భాలలో మనసులో మెదిలేవే అయినా, ఆ రోజే రామాయణం స్క్రీనుమీద ప్రారంభం అవటంవలన కాబోలు యాదృచ్ఛికంగానే నాకూ చటుక్కున అలా స్ఫురించింది. మా ఆవిడకూడా చాలా ముచ్చట పడింది ఆ పేర్లు విని. కౌసల్యని, సుమిత్రని, కైకేయిని రంగు రూప బేధాలనిబట్టి చటుక్కున గుర్తుపట్టగలుగుతున్నాం కూడా రెండు రోజుల్లోనే.

ఎటొచ్చీ, ఒకటే తేడా. దశరథుడి రాణులు ముగ్గురూ చాలా సఖ్యంగా వున్నట్టు వింటాం. కానీ ఈ కోడి రాణుల్లో పెద్దవి రెండూమాత్రం మూడో దాన్ని తమ పరిసరాల్లో తిరగనిచ్చేవి కాదు... గింజలు సమంగా తమతో ఏరుకోనిచ్చేవికాదు. దాన్ని తరిమి తరిమి కొడ్తుండేవి. కానీ కైకేయి బెదిరేదికాదు. వెళ్లి దశరథుడి దగ్గర తలదాచుకుంటుండేది. దాని ధైర్యం దానిది. ఆ తెల్లదనం, చక్కదనం చూసేమో ఆ దశరథుడెప్పుడూ ఎక్కువ దీని వెంటవెంట తిరుగుతుండేవాడు. మనుషుల్లోనే కాదు పశుపక్ష్యాదులలో కూడా చిన్నపెళ్లాం అంటే ముద్దన్నమాట. అసలందుకేనేమో పై రాణులిద్దరికీ ఈ మూడో రాణి అంటే అసూయ, అక్కసు. దశరథుడంతటివాడు కూడా పెద్ద భార్యకి పాయసం ఇచ్చాక, రెండో భాగం ముద్దుల భార్యకే ఇచ్చాడుకానీ, రెండో భార్యకేసైనా చూశాడా— పెద్ద భార్యకైనా బావుండదు, పట్టమహిషి కదా అని ఇచ్చివుంటాడు. లేనిపక్షంలో కైకేయి పాయసాన్ని మూడు భాగాలుచేసి చిన్నబుచ్చుకు నిల్చున్న పెద్దరాణులిద్దరికీ ఇవ్వవలసి వచ్చేది.

రెండో ఆదివారం టీవీ స్క్రీనుమీద రామాయణం కార్యక్రమం చూస్తున్నాం. ఉయ్యాలలో సయ్యాటలాడుతున్న రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులని చూస్తూ మా ఆవిడ చటుక్కున ఓ ధర్మ సందేహం వెలిబుచ్చింది.

'అవునూ, రెండు నెలలనుంచీ చూస్తున్నాం. మనదొడ్లో ఈ పెట్టలూపుంజేకానీ పిల్లలు కనిపించవేమండీ' అంటూ.

నాకు నవ్వొచ్చింది.

'పిచ్చిదానా రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులని పుట్టిన వాళ్లని పుట్టినట్లే మన ఇంటివాళ్లు గుటకాయస్వాహా చేస్తుంటే ఇంక దశరథుడికి సంతానం ఎక్కడిదే. దురదృష్టవంతుడు పాపం అని తొలిసారిగా మా దశరథుడిమీద జాలిపడ్డాను. తెల్లవారు ఝామునే నా నిద్ర పాడుచేస్తున్నా సరే.

నాకు అంత జాలి కలగటానికి కారణం లేకపోలేదు.

పదమూడేళ్లనుంచీ కాపురం చేస్తున్నా మా ఇద్దరికీ దశరథుడంతటివాడికే తప్పనట్లు — సంతానం లేదు.

ఓ రెండుసార్లు పుట్టబోయినవాళ్లని ఎందుకో తొందరపడి వెనక్కి లాగేసుకున్నాడు ఆ పుట్టించేవాడు. బహుశా ఆ పుట్టబోయినవాళ్లు పుణ్యాత్ములేమో. పాపాత్ములనుకొని పొరపాటున జన్మ ఇవ్వబోయి, చిత్రగుప్తుడు చిట్టా సరిజూసి తాఖీదు పంపాక గమ్మున వెనక్కి లాగేసుకుని పుట్టకముందే మోక్షం ఇచ్చేశాడేమో. అంతే అయివుండాలి.

ఈ నా ఆలోచన నిజమేనని ఆమోదిస్తున్నట్లో లేక ఇందాక తన పరిస్థితిని సహృదయంతో అర్థం చేసుకుని జాలిపడినందుకు కృతజ్ఞతలు తెలియపరచ డానికో తెలియదుకానీ, బైటదొడ్లో నేలమీదినుంచీ రెక్కలు టపటలాడించుకుంటూ కెక్కెక్కెక్కే అంటూ ఎగిరి గంతేసి నేను కూర్చున్న కుర్చీ పక్కనే కిటికీలో వాలాడు దశరథ మహారాజు... హఠాత్తుగా.

హడలుకు చచ్చాను.

మా ఆవిడకు ఈ కోళ్లఫ్యామిలీమీద ముచ్చటా, మమకారం ఎక్కువై సెనగపప్పు, అటుకులా, నేను తింటానికి తెచ్చుకున్న కాలక్షేపం బఠాణీలూ కిటికీల్లో వెయ్యటం మొదలెట్టింది. అక్కడనుంచీ ఇవి గంటకోసారి ఆకలేసినప్పుడల్లా లేక నేలమీద గింజలూ, పురుగులూ దొరకనప్పుడల్లా ఇలా కెక్కెక్కెక్కే అంటూ కిటికీల్లోకి గెంతి కూర్చుని వెతుక్కోవటం.

మొన్నోరోజున నేను బాత్రూంలో స్నానం చేస్తుంటే — మీరు నమ్మరేమో కానీ — పైన ఎక్కడో వున్న వెంటిలేటర్లోకి కెక్కెక్కెక్కే అంటూ హఠాత్తుగా ఒక్క ఉదుటున రెక్కల చప్పుడు చేస్తూ ఎగిరి కూర్చుంది. కౌసల్య అనుకుంటాను.


రెక్కల చప్పుడూ నోటికి తాళం.

అనుకోని పరిణామానికి హడిలిపోయి చేతిలో నీళ్లచెంబుకాలిమీద వేసుకున్నాను.

వళ్లు మండిపోయి స్నానం చెయ్యటం మానేసి బైటకొచ్చి (తుండు చుట్టుకునేలెండి) మా ఆవిడ మీద గంతులేశాను.

'ఇంకా వాటికి కిటికీల్లో అటుకులూ, శనగపప్పూ, వేగోడీలూ వెయ్యటం అలవాటు చేశావంటే ఊరుకోనంతే. అవి వెంటిలేటరుని చూసికూడా కిటికీ అనుకుని గెంతి కూర్చుంటున్నాయి. హడలుకు చచ్చాను. కాలు చితికిపోయింది చూడు'.

కాలు చితికినందుకు జాలిపడినా నా అజ్ఞానానికి



కుమారుడు తల్లిని చూసి అడిగాడు

"అమ్మా నేనెలా వచ్చాను?"

తల్లి తండ్రిని చూసింది. తండ్రి తల్లిని చూసేడు. అతని తల్లి ఆమె భర్తను చూసింది. అందరూ ఆకాశాన్ని చూశారు. దేవుడు అక్కడి నుంచి సమాధానమిచ్చాడు.

"మీరు ఎలా వచ్చారో మీ అందరికీ తెలుసు. ఆ ప్రశ్నకు సమాధానం తెలియనివాణ్ణి నేనొక్కణ్ణే!"

నవ్వింది మా ఆవిడ.

'మీ మొహంలెండీ(మర్యాదగానే అందిలెండి) అవి గుడ్లు పెట్టటానికి అలా దూరందూరంగా ఎగిరి వెళ్లి కూర్చుంటాయి. మన పనిమనిషి చెప్పింది. గుడ్డుపెట్టే టైమయి ఉంటుంది. వెంటిలేటరు ఎక్కి కూర్చుని వుంటుందంటే గింజలకోసం కాదు.'

మళ్లీ వెళ్లి స్నానం చెయ్యటం మొదలెట్టాక. కాలునెప్పి కాస్త తగ్గుముఖం పదుతుండగా, ఈ కోడి పెట్టమీదకూడా జాలిపడి ఆలోచనలో పడ్డాను (కారణం చెప్పానుకదా).

మా ఇంటావిడ అప్పుడప్పుడూ స్టూలు వేసుకుని మరీ గోడలమీదా, గుట్టలమీదా వెతుక్కుంటూ వుంటుంది. ఇదన్నమాట సంగతి—

పిచ్చిమొహం కాకపోతే. ఎంత ఎత్తులో పెడితే మాత్రం... దానికి ఆ గుడ్డు దక్కుతుందా. వెర్రి కౌసల్య అనుకున్నాను జాలిగా.

ఇలా రోజులు గడిచిపోతున్నాయి.

అన్ని రోజులూ ఒక్కలాగానే గడిచిపోతూ, రేపు గురించి అంటూ ఆశ పెట్టుకోటానికీ, ఆలోచించ డానికీ ఏమీలేని స్తబ్దమైన మా ఇద్దరి జీవితంలో, పోనీలే ఏదో విధంగా మా ఆవిడకి కాలక్షేపం అవుతోంది కదా అని నేనుకూడా ఆ కోడి కుటుంబాన్ని తిట్టటం, ఆ కారణంగా మా ఆవిణ్ణి తిట్టటంకూడా మానేశాను.


ఉన్నట్టుండి ఓరోజు పొద్దున్నే ఎక్కడికో ప్రయాణం పెట్టింది మా ఇంటావిడ. ఆవిడ ఊళ్లో బంధువులింటికో, పొరుగూళ్లలో కొడుకులూ, కూతుళ్ల దగ్గరకో ప్రయాణం పెట్టుకున్నరోజున మాకు పొద్దున్నే తెలిసిపోతుంది. ఆ హడావుడీ, సందడి నీళ్ల ట్యూబులు మడిచి లోపలపెట్టడం, పనికుర్రాడికి అంపకాలు పెట్టడం...

ఆరోజూ అలాగే అంపకాలు పెట్టి, భానుమతి అత్తగారు గదులన్నీ తాళాలు వేసుకుని — సహారా ఎడారి భూదానమిచ్చినట్లు — వంటగది వరండా వంటవాడి ఆశ్రయానికి వదిలేసినట్లుగా, మా ఇంటావిడకూడా ఇల్లంతా తాళాలువేసి, వీధి అరుగు పనికుర్రాడికి దానంచేసి పతిసమేతంగా ప్రయాణమై వెళ్లింది.

షారుగూరు వెళ్లేటట్లయితే మాకు చెప్పి వెళ్తారు ఇద్దరూ. అలా కాలేదుకాబట్టి ఊళ్లోనే ఎక్కడికో వెళ్లారనుకున్నాం. ఇంగ్లీషువాళ్ల పద్ధతుల్లో తరచుగా ఒకరి ఇంట్లో ఒకరు విందులు కుదుపుకుంటూ వుంటారు మా ఇంటివాళ్లు వాళ్ల బంధువర్గం. అలాంటపుడు పనికుర్రాదు కూడా వాళ్లతోపాటు వెళ్లి భోజనం చేసి వెంటనే వచ్చేస్తాడు. వాళ్లిద్దరూ ఏ రాత్రికో వస్తారు. మా గుమ్మందగ్గర కట్టిపడేసి వుండే కుక్క 'పింటూ' మాత్రం వాళ్ల ప్రాణానికి ఉసూరుమంటూ ఆ రోజు పస్తు పడుకోవలసిందే. అలా జరక్కుండా అది ఆ పూటకూడా అన్నానికి నోచుకుందంటే మా ఆవిడ జాలిగుండే కారణం. మా ఇంటావిడకంటే కూడా ఎక్కువగా, ఆవిడ కంటా, నా కంటాకూడా పడకుండా దానికి పోషణ చేస్తుంటుంది మా ఆవిడ. అదికూడా ఆకలేసినపుడల్లా రాత్రి పదకొండుగంటల వేళయినాసరే దొర్జన్యంగా వంటగది తలుపు బరబరా గోకి మరీ, మేం తలుపుతీసేసరికి, మా మొహంలోకి చూస్తూ విముషానికి మూడొందల సైచిలుకు వైబ్రేషన్లతో తోక ఊపుకుంటూ — నడ్డితోసహా ఊగిసలాడిపోతూ — నిలబడుతుంది.. రకరకాల టిఫిన్లరుచులు గుర్తొచ్చి నోరూరిస్తుంటే.

దానిక్కూడా మా ఆవిడ కలిపి పెట్టే మజ్జిగ పులుసు అన్నం అంటే మహాప్రాణం. చీమలకి కూడా మిగల్చకుండా లొట్టలేసుకుంటూ గిన్నె నాకేసి ఇంకా తోకాడించుకుంటూ చూస్తుంది మా ఆవిడ మొహంకేసి... వుండమంటారా, వెళ్లమంటారా అన్నట్లు.

ఏ మాటకామాటే చెప్పాలి మా శ్రీమతి మజ్జిగ పులుసు మహా కమ్మగా చేస్తుంది. దానిలో ఇంకా



సొరకాయ ముక్కలూ, ఇంత గుప్పెడు కొత్తిమీరా కూడా వేస్తే నాకూ మహాప్రాణం. పెరుగు వడలని తిన్నట్లుగా ఉత్తి ఆ సొరకాయ ముక్కలనే టిఫిన్‌లా తినాలనిపిస్తుంది. ఎటొచ్చి చిక్కేమిటంటే, మా ఆవిడకి ఆ మజ్జిగ పులుసంటే ఉన్న మక్కువ కారణంగా నాలుగు పూటలకి(రోజులకి కాదు) సరిపడా, గిన్నెనిండా 'సాంబారు పరప్పు'లా పెడుతుంది. నాలుగు పూటలయినా దాని రంగూ, రుచీ, వాసనా చెడక కమ్మగానే వుంటుంది దాని దుంపతెగ.

ఎంతైనా సామెత చెప్పినట్లుగా మూడోపూట తినగానే నాకు మొహం మొత్తుతుంది. ఇంకా నాల్గో పూట నా వాటా మజ్జిగ పులుసుకూడా మా సింటూ పాలే.

ఇంత పోషణ జరుగుతుంటే ఇంక అది మా ఇంటివాళ్లకంటే ఎక్కువగా మా చుట్టూనే తోకాడించుకుంటూ తిరగడంలో వింతేముంది. కానీ నాకనిపిస్తుందీ దానిది మామీదకంటేకూడా మా తిండి మీదే ప్రేమెక్కువని. తిండి చూడగానే పూనకం వచ్చినట్లుగా ఊగిపోయే ఆ తోక ఉత్తిప్పుడు చిటెక వేసినాసరే ఊపదు. ఏదో మరీ బావుండదన్నట్లుగా చిన్న బుచ్చటం ఇష్టం లేనట్లుగా మొహమాటంగా శాస్త్రార్థం ఓసారి ఊపేసి బద్ధకంగా ముడుచుకుని పడుకుంటుంది దొంగరాస్కెల్. పాపం నైట్ డ్యూటీ బడలికకూడా కావచ్చు.

సరే ఆ సాయంత్రానికల్లా మా ఇంటివాళ్లు వచ్చేశారు.

ఆ మర్నాడు పొద్దున్న అయిదుగంటలకే మా ఇల్లు మహా సందడిగావుంది మా ఇంటావిడ హడావుడితో.

ఆ హడావుడికీ, చప్పుళ్లకీ తనకికూడా మెలకువ వచ్చేసి, ఇహంలోకి వచ్చాక బుర్ర పనిచేసి, 'నిన్న ఈవిడ వెళ్లిందిగా, ఇవాళ వాళ్లని పిలిచినట్లుంది విందు భోజనానికి ఇంకా ఇవాళంతా ఇల్లంతా సందడే' అంది మా ఆవిడ మళ్లీ నిద్రలోకి జారుకునే ప్రయత్నం చేస్తూ.

కానీ ఓ చెవికింద ఇంటావిడ రణగొణ ధ్వనులూ, భేరీ నినాదాలు, మరో చెవి కింద మా దశరథ మహారాజు కొక్కొరోకోతో వెంటనే నిద్రపట్టక కాసేపు తన్నుకుని, 'వెధవది ఒక్క కోడిపుంజుకే ఇంత గోలగావుంది. ఇంకా కోళ్లఫారాల్లో ఈపరికి ఎంతగోలగా వుంటుందండీ' అంది మా శ్రీమతి తొలిసారిగా కోడికూత రుచిచూస్తూ.

కోళ్లఫారాల్లో కోళ్లన్నీ కృత్రిమంగా ఇంజక్షన్లతో తయారై ఆధునికంగా పుట్టి పెరిగే మోడరన్ కోళ్లు కదా మూడో జాములో లేచేనేమో, బస్తీమనుషులతో పాటు ఏడుగంటలకే లేస్తాయేమోలే... పడుకో పడుకో.. అన్నాను నిద్రకి నీళ్ళొదిలేస్తూనే.

ఆ రోజు ఆదివారంకూడా.

ఆ వేళయినా మరి కాస్సేపు ఆలస్యంగా లేచి నిద్రకరువు తీర్చుకుందామన్న నా ప్రయత్నాలేమీ సాగలేదు ఇంటావిడ యుద్ధరంగ బీభత్సాలతో.

ఏడు గంటలకల్లా బద్ధకంగా లేచి కాలకృత్యాలు తీర్చుకుని, కాఫీలుపూర్తిచేసి, తొమ్మిదింటికల్లా న్యూసు పేపరు ఆదివారం ప్రత్యేక అనుబంధంతో సహా నమిలి మింగేశాక ఇద్దరం మా ముందుగది గుమ్మంలో కూర్చుని రెండోసారి కాఫీ సేవనం సాగిస్తూ దొడ్డినిండా, మొక్కలమధ్య సందడిగా తిరుగుతున్న రకరకాల పిట్టలనీ, ఇంటావిడ దొడ్డంతా సిమెంటు చప్టా ట్యాబు పెట్టి కడగ్గా గుంటల్లో నిలిచిన నీళ్లల్లో జలకాలాడుతున్న పిచ్చికలనీ, మూతి చుట్టూ తిరుగుతూ తన నిద్ర పాడుచేస్తున్న జోరీగని కసిగా నోటితో పట్టెయ్యాలని గంటనుంచీ తంటాలు పడుతున్న మా సింటూ తిప్పల్నీ చూస్తూ కాలక్షేపం చేస్తున్నాం.

హఠాత్తుగా మా ఆవిడ భ్రుకుటి ముడిపడింది.

'అవునూ. ఇందాకటినుంచీ చూస్తున్నాను. కౌసల్యా, సుమిత్రా, కైకేయీ కనిపిస్తున్నాయి కానీ దశరథమహారాజు ఏడండి. ఎప్పుడూ వీటితోక చుట్టూనే తిరుగుతుంటాడుగా. విడివిడిగా వుండనే ఎప్పుడూ నూ...' అంది.

'ఆ అటుపక్క నెక్కడో ఆవిడ విందు భోజనం తయారీలోంచి ఏమైనా కొట్టెయ్యాలని ట్రై చేస్తూ తిరుగుతున్నాడేమోలే' అన్నాను హాస్యంగా.

అన్నాను కానీ అప్పుడే అటుపక్క మూల చెత్తలోంచి ఇటుగా గాలికి కొట్టుకు వచ్చిన ఓ తెల్లరంగు ఈక ఏదో అనుమానం రేపింది. చూపుసారించి ఆ చెత్తకుప్పకేసి చూశాను. నా అనుమానం నిజమనిపిస్తోంది.


ఇంతలో నా ముక్కుపుటాలుకూడా చురుగ్గా పనిచెయ్యటం మొదలెట్టాయి.

నా అపరాధ పరిశోధనని అర్థం చేసుకోలేక తన ధోరణిలో తనువున్న మా ఆవిడ, కాస్సేపు నిశ్శబ్దం తర్వాత ఆ ముగ్గురు రాణులనీ చూస్తూ పొద్దున మీరు లేచాక చూశారా అనడిగింది మళ్లీ.

'పిచ్చిమొహమా. ఇంకెక్కడి దశరథ మహారాజే. ఎప్పుడో ఖర్చైపోయాడు' అన్నాను. అర్థం చేసుకోవటానికి అర నిముషం పైనే పట్టింది మా శ్రీమతికి.

ఆ దశరథమహారాజు జన్మంతా పిల్లలకోసం అర్రులుచాచి, ముసలితనంలో కని, పెంచి, వాళ్ల ఆటపాటలతో పసిపిల్లాడిలా ఆనందించి, తీరా వాళ్ళు పెరిగి పెద్దవాళ్లయ్యాక, వాళ్ల బాగోగులు చూసుకునే ప్రాప్తంలేక పుత్రవియోగం భరించలేక, హృదయ విదారకంగా రాతి గుండెలు కరిగేలా, గుండె పగిలి చచ్చిపోతే, ఈ దశరథ మహారాజు అసలు సంతానం కంట చూసుకునే యోగం లేకుండానే ఖర్చైపోయాడు అనుకున్నాను — కూడని వేళల్లోకూడా మదిలో మెదుల్తుంటే సెన్సాఫ్ హ్యూమర్ ప్రేరితంగా.

ఏది ఏమైనా హఠాత్తుగా అనాథలైపోయిన ఆ ముగ్గురు రాణులకోసం మా ఇంటావిడ మార్కెట్‌కి వెళ్లి మరో దశరథ మహారాజుని తీసుకువచ్చేదాకా నా ప్రాతఃకాలపు నిద్రకి కొన్నాళ్లపాటు భంగంలేకుండా గడిచిపోయింది. ○



ఫోటోగ్రాఫర్‌ను అడిగింది కమలం. "నా ఫోటో బాగా వస్తుందంటావా?" ఆ.... ఫోటో చూసి మీరే గుర్తుపట్టలేనంత గొప్పగా వుంటుంది!"

పి. శ్రీవిద్య
విజయవాడ

